క్లుప్తంగా

వేడుకగా రాములోరి పెళ్లి రాట

ఎంవీపీకాలనీ: శ్రీరామ నవమిని పురస్కరించుకొని అప్పుఘర్‌లోని సీతారామ సాగర లింగేశ్వర ఆలయంలో సోమవారం రాములోరి కల్యాణ రాట మహోత్సవం ఘనంగా నిర్వహించారు. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో అప్పుఘర్ లుంబినీ పార్క్‌ను ఆనుకొని ఉన్న తీరంలో ఈ కార్యక్రమం జరిగింది. ఈ నెల 5న ఉత్సవ మూర్తుల తిరువూరు ఊరేగింపు, 6న సీతారాముల కల్యాణం ఘనంగా నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. కార్యక్రమంలో అప్పుఘర్, మూలపాలెం ప్రాంతాల భక్తులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

36 మందికి జాతీయ రత్న ఉగాది పురస్కారాలు



నృత్య ప్రదర్శనతో అలరిస్తున్న చిన్నారులు

సీతంపేట: దాసరి నారాయణరావు కల్చరల్ అకాడమీ, విశాఖ రత్న కళాపరిషత్ సంయుక్తంగా సోమవారం ద్వారకానగర్ పౌర గ్రంథాలయంలో జాతీయ రత్న ఉగాది పురస్కారాల ప్రదాన కార్యక్రమం నిర్వహించాయి. సంస్థ వ్యవస్థాపకుడు పి.ఎ.భాస్కరరావు అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ముఖ్య అతిథులు పైడా కృష్ణప్రసాద్, కంచర్ల అచ్యుతరావు వివిధ రంగాల్లో విశేష సేవలందించిన 36 మందిని పురస్కారాలతో సత్కరించారు. ఈ సందర్భంగా పలువురు చిన్నారులు ప్రదర్శించిన సంప్రదాయ, శాస్త్రీయ నృత్యాలు అలరించాయి. కార్యక్రమంలో ఆచార్య వి.బాలమోహన్‌దాస్, దుగ్గివలస దివాకర్, సినీ నటుడు ప్రసన్నకుమార్, సింగంశెట్టి సత్యనారాయణ, సన్‌మూర్తి, కెంబూరి చంద్రమౌళి, ఎల్.ఆర్.కృష్ణబాబు పాల్గొన్నారు.

కూచిపూడి నృత్య శిక్షణ ప్రారంభం

దాబాగార్డెన్స్: వేసవి శిక్షణ కార్యక్రమాల్లో భాగంగా పాతనగరంలోని స్వామి వివేకానంద సంస్థలో నాట్యదీపిక కూచిపూడి అకాడమీ వ్యవస్థాపకురాలు ఎల్.ఇంద్రాణి నరేంద్ర ఆధ్వర్యంలో ఉచిత కూచిపూడి నృత్య శిక్షణ తరగతులు సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా 35వ వార్డు కార్పొరేటర్ విల్లూరి భాస్కరరావు మాట్లాడుతూ శిక్షణను సద్వినియోగం చేసుకోవాలన్నారు. కూచిపూడి అకాడమీ వ్యవస్థాపకురాలు ఇంద్రాణి నరేంద్ర మాట్లాడుతూ ఆంధ్ర రాష్ట్రానికి కూచిపూడి నృత్యం ప్రత్యేకం అన్నారు. ఏకాగ్రత..భక్తి శ్రద్ధలతో నృత్యాన్ని నేర్చుకోవాలని సూచించారు. కార్యక్రమంలో సంస్థ అధ్యక్షుడు సూరాడ అప్పారావు, సంస్థ మహిళా సభ్యులు ఉమాదేవి, కనకమహాలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

నేడు కనకమహాలక్ష్మికి అష్టదళ పద్మారాధన

దాబాగార్డెన్స్: ఉత్తరాంధ్ర కల్పవల్లి, విశాఖ వాసుల ఆరాధ్యదైవం కనకమహాలక్ష్మికి 108 స్వర్ణ పుష్పాలతో మంగళవారం అష్టదళ పద్మారాధన నిర్వహించనున్నారు. ఉదయం 7 నుంచి 8 గంటల వరకు నిర్వహించనున్న ప్రత్యేక పూజలో పాల్గొనదలచే భక్తులు రూ.1,116 చెల్లించి పేర్లు నమోదు చేసుకోవాలి. వివరాలకు 0891-2711725, 2566514 నంబర్లకు ఫోన్ చేయవచ్చు. భక్తులు యూనియన్ బ్యాంక్ అకౌంట్ నెంబరు 060810011006681 టౌన్‌కొత్తరోడ్డు బ్రాంచ్, ఐఎఫ్ఎస్‌సీ కోడ్ యూబీఐఎన్ 0806081కు ఆన్‌లైన్ పేమెంట్ చేసి, పేరు, గోత్రం తెలిపితే వారి పేరిట పూజ నిర్వహిస్తారు.

రామాయణ పాటలపై ప్రవచనాలు



ప్రవచిస్తున్న ఆచార్య మలయవాసిని

సీతంపేట: లలితానగర్ లలితా పీఠంలో వసంత నవరాత్రుల సందర్భంగా సోమవారం సాయంత్రం రామాయణ ప్రవచనాలు ప్రారంభమయ్యాయి. మహిళల రామాయణపు పాటలపై నాలుగు రోజులు ప్రసంగాలు జరగనున్నాయి. తొలి రోజు ఆచార్య కోలవెన్ను మలయవాసిని మహిళల రామాయణపు పాటల వైశిష్ట్యాన్ని, జానపద రామాయణాల గురించి అనేక విషయాలు వివరించారు. రామాయణ గ్రంథాల్లో లేని విషయాలు, జానపద స్త్రీలు తమ ఆలోచనలు, నమ్మకాలకు అనుగుణంగా భావించి పాడుకున్నారని, ఈ కథలు చాలా ఆసక్తికరంగా ఉండటమే కాకుండా పాడుకోడానికి వీలుగా ఉంటాయన్నారు. రాముడు, సీత, లక్ష్మణుడు, హనుమంతుడు పాత్రలను తమ కుటుంబ సభ్యుల్లా భావించి ఆత్మీయంగా పాడుకున్నారని చెప్పారు. అనంతరం ప్రవచన కర్తను పీఠం మేనేజర్ మన్నవ కృష్ణసేన్ సత్కరించారు.

తథాగతుడి చెంత.. ఏంటి ఈ వేషాలు



నెహ్రూ విగ్రహం వెనుక పరిసరాల్లో తిని పడేసిన ఆహార పదార్థాలు, కవర్లు

ఏయూక్యాంపస్: పర్యాటకులు నిత్యం సందర్శించే బీచ్ రోడ్డు ప్రాంతంలో మందుబాబుల చేష్టలు పెరిగిపోతున్నాయి. రాత్రి వేళల్లో సాగర తీరాన్ని, పర్యాటక ప్రాంతాన్ని మద్యం ప్రియులు తమకు అనుకూలంగా మార్చుకుంటున్నారు. మిడ్ నైట్ పార్టీలకు సాగరతీరంలోని లాన్‌లు వేదికలుగా మారిపోతున్నాయి. పోలీసుల పర్యవేక్షణ లేకపోవడంతో వీరు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారు

బుద్ధుడి విగ్రహం వెనుక..

ఆర్కే బీచ్‌కు కూతవేటు దూరంలో విశ్వప్రియ ఫంక్షన్ హాల్ ఉంది. దీనిని ఆనుకుని మాజీ ప్రధాని జవహర్ లాల్ నెహ్రూ, తథాగతుడు గౌతమ బుద్ధుడి విగ్రహాలున్నాయి. వీటి చుట్టూ మెట్ల తరహా నిర్మాణం, గ్రానైట్ రాళ్లతో ఎంతో అందంగా తీర్చిదిద్దారు. ఇదే ప్రాంతాన్ని మందుబాబులు తమకు అనుకూలంగా మార్చుకుంటున్నారు. పవిత్రమైన బుద్ధుడి విగ్రహం చెంతనే మద్యం తాగుతున్నారు. ఇది వారికి నిత్య కృత్యంగా మారిపోయింది. ఆధ్యాత్మికతను, పవిత్రతను చాటి ఈ ప్రదేశంలో తాగి పడేసిన మద్యం సీసాలు, బీర్ బాటిళ్లు దర్శనమిస్తున్నాయి.



విశ్వప్రియ ఫంక్షన్ హాల్ వద్ద గౌతమ బుద్ధుడి విగ్రహం వెనుక మద్యం సీసాలు

- బీచ్ రోడ్డులో మద్యపానంపై కొరవడిన నిఘా
- గౌతమ బుద్ధుడు, నెహ్రూ విగ్రహాల పక్కనే మద్యం సీసాలు
- రాత్రి వేళల్లో మందుబాబుల చేష్టలు



తాగి పడేసిన మద్యం సీసాలు

విద్యుత్ దీపాల లోపం..

బీచ్ రోడ్డులో విద్యుత్ దీపాల కాంతులు అంతంతమాత్రంగానే ఉంటున్నాయి. కొన్ని చోట్ల లైట్లు వెలగడం లేదు. చీకటిగా ఉండే ప్రాంతాలు మందుబాబులకు అనుకూలంగా మారుతున్నాయి. దీనితో వీరు రాత్రి వేళల్లో ఆహార పదార్థాలు ఆన్‌లైన్‌లో ఆర్డర్ చేసుకుని, పార్సిల్స్ తెచ్చుకుని మద్యం తాగుతూ ఇక్కడ ఎంజాయ్ చేస్తున్నారు.

నైట్ పార్టీలు ఇక్కడే...

రాత్రి వేళల్లో పార్టీలు చేసుకునే వారి సంఖ్య పెరిగిపోతోంది. పుట్టిన రోజు నుంచి అనేక రకాల సందర్భాలకు అనుగుణంగా ఇక్కడ పార్టీలు చేసుకుంటున్నారు. వీరు తమ వెంట ఆహార పదార్థాలు తెచ్చుకుని బీచ్ రోడ్డులో ఉన్న లాన్‌లలో కూర్చుని వేడుకలు జరుపుకుంటున్నారు. ఆహార పదార్థాలు, వాటికి సంబంధించిన డబ్బాలు, కవర్లు, నీళ్ల బాటిళ్లను ఎక్కడ పడితే అక్కడ పడేస్తున్నారు. దీనితో పరిసరాలు అధ్వానంగా తయారవుతున్నాయి. పారిశుధ్య సిబ్బందికి పనిభారం కూడా పెరుగుతోంది. ఉదయాన్నే వాకింగ్‌కు వచ్చే వారికి తిని పడేసిన ఫుడ్ కవర్లు, వాటర్ బాటిళ్లు తీవ్ర దుర్గంధాన్ని వెదజల్లుతున్నాయి. సంబంధిత అధికారులు దృష్టి సారించి బీచ్ రోడ్డులో ఇటువంటి సమస్యలు లేకుండా చూడాలని పలువురు సందర్శకులు కోరుతున్నారు.

కొరవడిన పర్యవేక్షణ..

బీచ్ రోడ్డులో మద్యం తాగే వారిపై పర్యవేక్షణ కొరవడింది. తగినంత సిబ్బంది లేకపోవడం, ట్రాఫిక్, క్రైం సమస్యలు పెరిగిపోవడంతో పోలీసులు పూర్తిస్థాయిలో దృష్టి సారించలేకపోతున్నారు. దీనిని అనువుగా మార్చుకున్న ఆకతాయిలు, మందుబాబులు సాగర తీరంలోని పలు ప్రాంతాల్లో రాత్రి వేళల్లో మద్యం తాగడం, మత్తుపదార్థాలు తీసుకోవడం జరుగుతున్నాయి.

ఆకట్టుకున్న రామ భజన



రామ భజన చేస్తున్న కళాకారులు

మద్దిలపాలెం: జీవీఎంసీ 15వ వార్డు పాత వెంకోజీ పాలెం శ్రీ సీతారామ సేవా సంఘం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న శ్రీరామనవమి ఉత్సవాల్లో భాగంగా సోమవారం ఆలయ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన రామ భజన భక్తులను ఎంతగానో ఆకట్టుకుంది. భక్తి పాటలతో కళాకారులు అందరి మన్ననలు పొందారు. ఆలయానికి వచ్చిన భక్తులను భక్తి పారవశ్యంలో ముంచేసింది. కార్యక్రమంలో మాజీ డిప్యూటీ మేయర్ మళ్ల అప్పలరాజు, సంఘ గౌరవ అధ్యక్షులు మళ్ల పోలిరాజు, అధ్యక్షుడు కర్రి వెంకట సూర్య అప్పారావు, ప్రధాన కార్యదర్శి బొడ్డేటి రామకృష్ణ, కార్యదర్శి రవి, కోశాధికారి యల్లపు శ్రీను, ఇతర కార్యవర్గ సభ్యులు, గవర కార్పొరేషన్ డైరెక్టర్ మళ్ల రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

పారిశుధ్య కార్మికులకు చీరల పంపిణీ



మహిళా కార్మికులకు చీరలు అందిస్తున్న పెదగదిలి శివాలయం కమిటీ సభ్యులు

ఆరిలోవ: జీవీఎంసీ 12వ వార్డు పెదగదిలి శివాలయంలో సోమవారం పారిశుధ్య మహిళా కార్మికులకు చీరలు పంపిణీ చేశారు. ఆలయ కమిటీ సభ్యులు శివ పూజలు జరిపించిన అనంతరం చీరలు అందజేశారు. ఈ సందర్భంగా కమిటీ సభ్యులు మాట్లాడుతూ ఉగాది సందర్భంగా సేవా కార్యక్రమంలో భాగంగా పారిశుధ్య కార్మికులకు చీరలు అందించినట్లు తెలిపారు. కార్యక్రమంలో కమిటీ సభ్యులు కొల బంగారయ్య, దూలి రఘు, చల్లా రాజు, పాత్రేరు శ్యామ్, పెసల శ్రీనివాసరావు, బొట్టా రమణ, పిట్ట శంకరరావు పాల్గొన్నారు.

అయ్యప్ప గురుస్వామికి యూఎస్ఏ వర్సిటీ డాక్టరేట్



డాక్టరేట్ అవార్డు అందుకుంటున్న గురుస్వామి సోమేష్

ఆరిలోవ: జీవీఎంసీ తొమ్మిదో వార్డు విశాలాక్షినగర్‌లోని భక్త తుకారాం ఆలయంలో కార్తీక మాసంలో అయ్యప్ప గురుస్వామి బైలపల్లి సోమేష్ 27 ఏళ్లుగా రోజుకు 2,000 మందికి పైగా అయ్యప్ప స్వాములకు అన్నదానం చేస్తున్నారు. ఈయన సేవలను గుర్తించిన యూఎస్ఏకి చెందిన టెక్సాస్‌లోని డే స్ప్రింగ్ టెక్నాలజీ యూనివర్సిటీ గౌరవ డాక్టరేట్ అవార్డు ఇచ్చింది. ఈ సందర్భంగా సోమవారం విశాలాక్షినగర్ పబ్లిక్ లైబ్రరీలో యూనివర్సిటీ ప్రతినిధులు ఆయనకు అవార్డు అందజేశారు. అయ్యప్ప స్వాములకు సోమేష్ చేసిన సేవలను గుర్తించి డాక్టరేట్ ఇచ్చినట్లు ప్రతినిధులు తెలిపారు. ప్రతి ఆరు నెలలకు విశాఖ వచ్చి సేవలు, సాంస్కృతిక కార్యక్రమాలు చేసే వారిని గుర్తిస్తామని తెలిపారు. అలాంటి వారికి డాక్టరేట్లతో గౌరవిస్తామన్నారు. వర్సిటీ ప్రతినిధులకు గురుస్వామి సోమేష్ కృతజ్ఞతలు తెలిపారు.

ప్రైవేటీకరణ విధానాలను వ్యతిరేకించాలి



మాట్లాడుతున్న సీపీఎం నాయకుడు కుమార్

ఆరిలోవ: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్న ప్రైవేటీకరణ విధానాలను ప్రజలు వ్యతిరేకించాలని సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు ఆర్.కె.ఎస్.వి.కుమార్ పిలుపునిచ్చారు. తమిళనాడు రాష్ట్రం మధురైలో ఏప్రిల్ 2 నుంచి 6 వరకు జరగనున్న సీపీఎం అఖిల భారత 24వ మహాసభల సందర్భంగా దేశ వ్యాప్తంగా సీపీఎం జెండా ఆవిష్కరణ కార్యక్రమాలు చేపడుతున్నారు. ఇందులో భాగంగా సోమవారం 10వ వార్డు బి.ఎస్.ఆర్.నగర్‌లో ఆయన జెండా ఆవిష్కరించి మాట్లాడారు. తమిళనాడు మహాసభలను ప్రజలు జయప్రదం చేయాలని కోరారు. దేశంలో దోపిడీ లేని సమాజ స్థాపనకు సీపీఎం కృషి చేస్తోందన్నారు. ప్రైవేటీకరణల వల్ల దోపిడీ పెరిగిపోతోందన్నారు. అందుకే ప్రైవేటీకరణను అడ్డుకోవడం ప్రతి ఒక్కరూ బాధ్యతగా తీసుకోవాలన్నారు. విశాఖ స్టీల్‌ప్లాంట్, పీపీపీ విధానంతో ప్రభుత్వ ఆస్తులు ప్రైవేట్‌పరం అవుతున్నాయన్నారు. విద్యుత్ సంస్కరణల పేరుతో స్మార్ట్ మీటర్లు అమర్చడం, ట్రూ అప్ చార్జీలు, సర్దుబాటు చార్జీల పేరుతో ప్రజలపై విద్యుత్ భారాలు మోపడం చేస్తున్నారన్నారు. వీటిని ప్రజలు వ్యతిరేకించాలని కోరారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు వెంకటరావు, నాగరాజు, రమణ, మణి, కృష్ణవేణి, అన్నపూర్ణ, సీతాలక్ష్మి పాల్గొన్నారు.

విశాలాక్షికి సేవా నివాళి



మహిళలు, చిన్నారులకు దుస్తులు పంపిణీ చేస్తున్న నిర్వాహకులు

మహారాణిపేట: స్వాతంత్ర్య సమరయోధురాలు, తామ్రపత్ర గ్రహీత రూపాకుల విశాలాక్షి 99వ జయంతి సందర్భంగా పేద మహిళలకు చీరలు, పండ్లు పంపిణీ చేశారు. మహారాణిపేటలోని ప్రకృతి చికిత్సాలయ ఆవరణలో శ్రీ గాయత్రి వెల్ఫేర్ కల్చరల్ యూత్ అకాడమీ, ప్రకృతి చికిత్సాలయం, రూపాకుల విశాలాక్షి చారిటబుల్ ట్రస్ట్ సంయుక్త నిర్వహణలో జరిగిన కార్యక్రమంలో తొలుత విశాలాక్షి చిత్రపటానికి డాక్టర్ ఎస్.లక్ష్మీనారాయణ పూలమాలవేసి నివాళులర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ సమరయోధుల త్యాగాలను, కృషిని గుర్తు చేసుకుని, వారు చూపిన బాటలో నడవాలన్నారు. కార్యక్రమంలో రాజీవ్ గాంధీ మానవసేవ జాతీయ అవార్డు గ్రహీత రూపాకుల రవికుమార్, డాక్టర్ ఎస్.శ్రీలక్ష్మి, జయంతి శేష అన్నపూర్ణ మౌనిక, గుడా మైథిలి, శ్రీధర్, ఫణికాత్య, క్షీరాబ్ధి దుతి, గేదెల శ్రీహరి, రమణ, కొండమ్మ, బంగారమ్మ, మంగ, జయంతి రక్షిత్, సాయి పూజిత తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి వాణిజ్య సంస్థలు, మల్టీప్లెక్స్‌ల్లో పార్కింగ్ ఉచితం

దాబాగార్డెన్స్: వాణిజ్య సంస్థలు, మాల్స్, మల్టీప్లెక్స్‌ల్లో పార్కింగ్ రుసుం వసూళ్లపై పురపాలన, పట్టణాభివృద్ధి శాఖ(ఎంఏయూడీ) ఉత్తర్వుల్ని ఈ నెల 1 నుంచి తప్పనిసరిగా అమలు చేయాలని కన్స్యూమర్ రైట్స్ ఆర్గనైజేషన్(క్రో) ఏపీ అధ్యక్షుడు గొర్లె శ్రీనివాసనాయుడు తెలిపారు. నగరంలోని ఓ హోటల్లో సోమవారం నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. తాజా ఉత్తర్వుల మేరకు మాల్స్, మల్టీప్లెక్స్‌ల్లో షాపింగ్ బిల్, సినిమా టికెట్ చూపిన వారి నుంచి ఎలాంటి పార్కింగ్ రుసుం వసూలు చేయడానికి వీల్లేదన్నారు. కేంద్ర ప్రభుత్వ మోడల్ బిల్డింగ్ బైలాస్-2016 ఆధారంగా రాష్ట్రంలోని భవన నిర్మాణ కార్యకలాపాలకు వర్తించే ఏపీ బిల్డింగ్ రూల్స్-2017ను ప్రభుత్వం జారీ చేసిందన్నారు. అందులో పేర్కొన్నట్లు భవనాల్లో పార్కింగ్ స్థలం తప్పనిసరన్నారు. రాష్ట్రంలోని మాల్స్, మల్టీప్లెక్స్‌లు తదితర వాటి నుంచి పార్కింగ్ రుసుం వసూలుకు వ్యతిరేకంగా ఫిర్యాదులు ప్రభుత్వానికి అందాయన్నారు. ప్రజా ప్రయోజనాల దృష్ట్యా పార్కింగ్ దుర్వినియోగ నిరోధానికి పురపాలక శాఖ తాజా మార్గదర్శకాలు ప్రతిపాదించినట్లు తెలిపారు. తొలి అర్ధగంట వరకు పార్కింగ్ ఉచితమని, 30 నిమిషాలు పైబడి గంట వరకు వాహనం పార్కింగ్ చేసిన వ్యక్తి ఆ మాల్లో ఎంతైనా బిల్లింగ్ చేసినట్లు రసీదు చూపితే అది కూడా ఉచితమేనన్నారు. గంటకు పైగా పార్కింగ్ చేసినవారు సంబంధిత మాల్/మల్టీప్లెక్స్‌లో షాపింగ్ చేసినట్లు రుజువు చూపించకపోతే పార్కింగ్ రుసుం వసూలు చేయవచ్చన్నారు. షాపింగ్ బిల్లు, సినిమా టికెట్ చూపిస్తే ఉచిత పార్కింగ్ సదుపాయం కల్పించాలన్నారు. ఏప్రిల్ 1 నుంచి అమల్లోకి రానున్న ఈ ఆదేశాలు ధిక్కరిస్తే చర్యలు తీసుకోవడం తప్పదన్నారు. సంస్థ జాతీయ కార్యదర్శి మూల వెంకటరావు, ఏపీ స్పోక్స్ పర్సన్ కరణం రెడ్డి నరసింగరావు, కార్యదర్శి రాజా, జాతీయ కార్యవర్గ సభ్యులు దీపక్‌వర్మ, సునీల్, లోగిన గణేష్, గోపి, శశి, వేణుగోపాల్ పాల్గొన్నారు.

అలరించిన శ్రీరామదాసు కీర్తనలు

ఎంవీపీకాలనీ: లలిత సప్తస్వరాల సభ్యులు ఆలపించిన శ్రీరామదాసు, త్యాగరాజు కీర్తనలు అలరించాయి. ఎంవీపీ కాలనీ సెక్టార్-6లోని శ్రీ వేంకటేశ్వర స్వామి, ప్రసన్న ఆంజనేయ స్వామి ఆలయంలో వసంతి నవరాత్రి ఉత్సవాలను పురస్కరించుకొని సోమవారం లలిత సప్తస్వరాల సభ్యులచే సంగీత విభావరి నిర్వహించారు. బ్రోచేవారు ఎవరు, పలుకే బంగారమాయెలే, సీతారామ కల్యాణ వైభోగం వంటి భక్తిరస గీతాలతో వారు అలరించారు. భక్తులు, కమిటీ ప్రతినిధులు పాల్గొన్నారు.

ఘనంగా భావనా రుషి భద్రావతి పూజ

ఆరిలోవ: జీవీఎంసీ 11వ వార్డు గాంధీనగర్‌లో భక్త మార్కండేయ పద్మశాలి యువజన సేవా సంఘం ఆధ్వర్యంలో సోమవారం భావనారుషి భద్రావతి పూజ ఘనంగా నిర్వహించారు. ఆరిలోవ ప్రాంతంలోని పద్మశాలి సామాజిక వర్గ కుటుంబ సభ్యులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. వారి కోసం సామాజిక వర్గ పెద్దలు కేటరింగ్ రాజు, రాజారావు, సన్యాసిరావు, సూరిబాబు, వెంకటేశ్వరరావు తదితరులు సౌకర్యాలు కల్పించారు.



అల్లిపురం మస్జీద్ ఈ ఫిర్దోస్ వద్ద ప్రార్థనల్లో పాల్గొన్న ముస్లింలు

అల్లిపురం: రంజాన్ వేడుకలు సోమవారం నియోజకవర్గంలో ఘనంగా జరిగాయి. రంజాన్ మాసం ఉపవాస దీక్షలు ఆదివారం రాత్రితో ముగిశాయి. ఆదివారం రాత్రి ఆకాశంలో నెలవంక దర్శనమివ్వడంతో పవిత్ర రంజాన్ (ఈద్ ఉల్ ఫితర్) వేడుకలు ఘనంగా నిర్వహించారు. జగదాంబ దరి మక్కా మసీదు, రిజర్వ్‌లైన్ మసీదు, అల్లిపురం యాతపేట వద్ద గల మస్జీద్ ఈ ఫిర్దోస్, కోటవీధి మసీదులతో పాటు ఏవీఎన్ కాలేజీ దరి మసీదులో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. ముస్లింలు కొత్తబట్టలు ధరించి ఒకరికొకరు శుభాకాంక్షలు తెలుపుకున్నారు. పిల్లలు పెద్దలు నుంచి ఈద్ (బహుమతులు) అందుకున్నారు. వారి కుటుంబాలు, స్నేహితులతో కలసి పండగను ఉల్లాసంగా, ఉత్సాహంగా జరుపుకున్నారు. ప్రార్థనల అనంతరం ప్రతి ఒక్కరూ తమకు తోచిన ద్రవ్యాలను దానం చేశారు.

ఆట పరికరాలిలా.. ఆడుకునేదెలా..?

- వీఎంఆర్‌డీఏ పార్క్ బాలల ప్రాంగణంలో పాడైన నూతన ఆట వస్తువులు
- ఏర్పాటు చేసిన కొన్ని నెలలకే ఈ దుస్థితి









చిన్నారుల పార్కును బాలారిష్టాలు వెంటాడుతున్నాయి. ఎంతో ప్రతిష్టాత్మకంగా అభివృద్ధి చేసిన వీఎంఆర్‌డీఏ(వుడా) పార్క్‌లోని బాలల ఆటల ప్రాంగణం వెలవెలబోతోంది. ఇక్కడ పిల్లలు ఆడుకునేందుకు తగినన్ని ఆట వస్తువులు లేవు. కొన్ని ఆట పరికరాలు పాడైపోయాయి. వీటిలో కొన్ని ఇటీవల మార్పుచేసి కొత్తవి ఏర్పాటు చేశారు. వాటిలో నాణ్యతా లోపాలు కొట్టొచ్చినట్లు కనిపిస్తున్నాయి. కేవలం కొన్ని నెలల వ్యవధిలోనే పరికరాలు మూలకు చేరి నిరుపయోగంగా మారుతున్నాయి. కొద్ది రోజుల కిందట పార్క్‌లో నూతనంగా ఏర్పాటు చేసిన ఆట వస్తువులు అప్పుడే విరిగిపోవడం, పాడైపోవడం జరుగుతున్నాయి. పనుల్లో నాణ్యతా లోపానికి ఇవి అద్దం పడుతున్నాయి. సాయంత్రం వేళల్లో టికెట్లు కొని పార్క్‌కు వచ్చే చిన్నారులకు ఇవి తీవ్ర నిరాశను కలిగిస్తున్నాయి. ఆట పరికరాలతోపాటు ఈ ప్రాంగణంలో పాడైన ఇతర వస్తువులకు సైతం మరమ్మతులు చేయాల్సిన అవసరం ఉంది. వీఎంఆర్‌డీఏ అధికారులు దృష్టి సారించి, ఆట పరికరాలను సరఫరా చేసిన వారిపై తగిన చర్యలు తీసుకోవాలని పలువురు సందర్శకులు కోరుతున్నారు.

– ఏయూక్యాంపస్

మది దోచిన మధుర గీతాలు



ఇళయరాజా పాటలు ఆలపిస్తున్న కళాకారులు

దాబాగార్డెన్స్: స్వర రాగ సుధ అధ్యక్షుడు నేరెళ్ల రమేష్ నేతృత్వంలో స్థానిక అల్లూరి విజ్ఞాన కేంద్రంలో మేస్ట్రో ఇళయరాజా స్వర పరచిన గీతాలతో సోమవారం నిర్వహించిన సినీ సంగీత విభావరి ఆద్యంతం అలరించింది. కడలి, రాధ పాడిన ఓ ప్రియా ప్రియా, రమేష్, రంజితల పట్టి తెచ్చానులే, మెలోడీ సత్యనారాయణ, భాగ్యలక్ష్మిల కలయా నిజమా, ఎమ్మెస్ మాధవ్, మణిల ఎదలో తొలి వలపే, ఎస్ఎన్ రావు, సీవీ రాజేశ్వరి ఆలపించిన నీవేగా నా ప్రాణం, అవినాష్, సుజాతల చలీ చలీ నా కొక్కొరకో, దేవరాజ్, మాధవీలత చిరు గాలి వీచెను.. తదితర పాటలు రస హృదయాలను రంజింపజేశాయి. కీబోర్డ్ ప్లేయర్ సోమేష్ బృందం సంగీత నిర్వహణలో జరిగిన కార్యక్రమంలో లక్ష్మీస్వరూప వ్యాఖ్యానం అలరించింది. కార్యక్రమంలో కళారంగ ప్రతినిధి చెన్నా తిరుమలరావు తదితరులు పాల్గొన్నారు.